సాక్షి అనకాపల్లి

శనివారం । 8 । ఫిబ్రవరి । 2025



నీవే స్ఫూర్తి.. చైతన్య దీప్తి 8లో



స్నోస్టేషన్ ప్రారంభం

విశాఖ పోర్టు స్టేడియంలో 'స్నో స్టేషన్' పేరుతో సరికొత్త మంచు వినోద కేంద్రం రూపుదిద్దుకుంది. 8లో

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 34.7 నుంచి 36 వరకూ, కనిష్ట ఉష్ణోగ్రతలు ఈనెల 8న 22.4, 9న 22.5, 10న 23.0, 11న 21.5, 12న 22.3 డిగ్రీలు ఉంటుందని తెలిపారు.

న్యూస్‌రీల్

దేశాన్ని పీడిస్తున్న సామాజిక రుగ్మత వెట్టిచాకిరీ



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

చోడవరం రూరల్: దేశాన్ని పట్టి పీడిస్తున్న సామాజిక రుగ్మత వెట్టి చాకిరీ అని మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వి.గౌరీశంకరరావు అన్నారు. వెట్టి చాకిరి నిషేధ చట్టం 1976 ఫిబ్రవరి 9న ఆమోదించబడిందన్నారు. శుక్రవారం స్థానిక వాసవీ కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెట్టి చాకిరీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ మేరకు హాజరైన ప్రతి ఒక్కరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ప్రజల వెనుకబాటుతనాన్ని, అవసరాలను ఆసరా చేసుకుని బానిసత్వానికి గురి చేయడాన్ని ప్రభుత్వం నేరంగా పరిగణిస్తుందని తెలిపారు. న్యాయవాది కొలగాని సతీష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ వెట్టిచాకిరీ కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడైనా వెట్టి చాకిరీ విషయం తెలిస్తే ఆ ప్రాంత మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌కు సమాచారం అందించాలని సూచించారు. మరో న్యాయవాది బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ వెట్టి చాకిరీ వ్యవస్థ కార్మిక సంబంధ నేరం మాత్రమే కాదని, ఇదొక తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన అని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో శ్రీవాసవీ కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఉప్పల నాగేశ్వరరావు, వి.సి.హెచ్.ఆర్.గుప్తా, సభ్యులు పాల్గొన్నారు.

పింఛన్ల స్వాహాపై విచారణ

గొలుగొండ : సాలికమల్లవరం పంచాయతీలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల నుండి వేలాది రూపాయల పింఛన్లు వెల్ఫేర్ అసిస్టెంట్ చంద్రశేఖర్ స్వాహా చేసినట్టు వచ్చిన ఆరోపణలపై శుక్రవారం ఎంపీడీవో మేరీ రోజ్, తహసీల్దార్ శ్రీనివాసరావు విచారణ నిర్వహించారు. గ్రామంలో ఈ నెలకు సంబంధించి పింఛన్ల సొమ్ము 10 మంది నుంచి ముందుగానే థంబ్ వేయించుకొని రూ.40 వేల వరకు స్వాహా చేసాడని పింఛనదారులు ఇచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టారు. పింఛనుదారుల నుంచి వివరాలు సేకరించిన మండల స్థాయి అధికారులు, ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్టు తెలిపారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి : ఎస్పీ



ఎస్పీ తుహిన్ సిన్హాకు సమస్యలు విన్నవించుకుంటున్న సిబ్బంది

అనకాపల్లి: పోలీసు ఉద్యోగులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా భరోసా ఇచ్చారు. తన కార్యాలయంలో శుక్రవారం పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు ఉద్యోగులు, సిబ్బంది, హోంగార్డులు హాజరై తమ అనారోగ్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. దీంతో ఎస్పీ సానుకూలంగా స్పందిస్తూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: కుంభమేళాకు మరిన్ని ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. విశాఖపట్నం-గోరఖ్‌పూర్(08588) స్పెషల్ ఈ నెల 10, 22వ తేదీల్లో రాత్రి 10.20 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరుతుంది. ఈ నెల 12, 24వ తేదీల్లో రాత్రి 7.30 గంటలకు గోరఖ్‌పూర్ చేరుకుంటుంది. గోరఖ్‌పూర్-విశాఖపట్నం(08587) స్పెషల్ ఈ నెల 13, 25వ తేదీల్లో సాయంత్రం 5.45 గంటలకు బయల్దేరి 15, 27వ తేదీల్లో మధ్యాహ్నం 3.55 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు 4-సెకండ్ ఏసీ, 3-థర్డ్ ఏసీ ఎకానమీ, 8-స్లీపర్ క్లాస్, 4-జనరల్, 1-సెకండ్ క్లాస్ కం లగేజీ/దివ్యాంగ కోచ్, 1జనరేటర్ మోటర్ కార్ కోచ్‌తో నడుస్తుంది.

టాటా-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రద్దు

కాజీపేట-విజయవాడ సెక్షన్ పరిధి ఖమ్మంలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే టాటానగర్-యశ్వంత్‌పూర్-టాటానగర్ ఎక్స్‌ప్రెస్‌ను ఆయా తేదీల్లో రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నెల 13న టాటానగర్-యశ్వంత్‌పూర్(18111) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 9,16న యశ్వంత్‌పూర్-టాటానగర్ (18112) ఎక్స్‌ప్రెస్ రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

ఆ 12 గ్రామాల మెడపై 1/70?

- మైదాన ప్రాంత భూములు ఐటీడీఏలోకి విలీనం జరిగితే నష్టమే
- నియోజకవర్గంలో 12 రెవెన్యూ గ్రామాలు 1/70 యాక్టు పరిధిలోకి..
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన పాడేరు ఐటీడీఏ అధికారులు
- రాష్ట్రం నుంచి కేంద్రానికి నివేదించడానికి అధికారులు కసరత్తు
- కూటమి ప్రభుత్వం చేతిలో వేలాది మంది గిరిజనేతరుల భవిష్యత్తు
- నర్సీపట్నం నియోజకవర్గంలో రెండు మండలాలపై ప్రభావం



1/70యాక్టు పరిధిలోకి మార్చేందుకు ప్రతిపాదనలు చేసిన ఉటమల్ల రెవెన్యూ పరిధిలో భూములు ఇవే



మైదాన ప్రాంతంలో ఉన్న డొంకాడ గ్రామం వద్ద వెర్రిగెడ్డ అనకట్టు



1/70 యాక్టు పరిధిలోకి వద్దంటూ రెవెన్యూ సదస్సు వద్ద రైతుల ఆందోళన(ఫైల్)



ఐటీడీఏ అధికారులు ప్రతిపాదనలు చేసిన మైదాన ప్రాంతం నాతవరం మండలంలో రెవెన్యూ గ్రామాలు

నాతవరం: నర్సీపట్నం నియోజకవర్గంలో నాతవరం, గొలుగొండ మండలాల్లో 12 రెవెన్యూ గ్రామాలను 1/70 యాక్టు పరిధిలోకి మార్చేందుకు పంపించిన ప్రతిపాదనలు అడ్డుకోకపోతే గిరిజనేతరులకు ఊహించని నష్టం జరగనుంది. మైదాన ప్రాంతమైన నాతవరం మండలంలో ఉటమల్ల, డొంకాడ అగ్రహారం, చిన జగ్గంపేట, రెవెన్యూ గ్రామాలు గొలుగొండ మండలంలో పోగచెట్లపాలెం, సీతకండి, వడపర్తి, జమ్మవరం, నల్లంకి, కరక, పల్లపునాగన్నదొరపాలెం, కసిమి, కొత్తపాలెం రెవెన్యూ గ్రామాలను పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రోణంకి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో 1/70 యాక్టు పరిధిలోకి విలీనం చేసేందుకు ప్రభుత్వానికి నివేదించారు. ప్రస్తుతం ఆ ప్రతిపాదన రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రానికి పంపించడానికి సంబంధిత శాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ప్రభుత్వం నుంచి 12 రెవెన్యూ గ్రామాల నివేదిక కేంద్రానికి పంపిస్తే ఆ గ్రామాలు 1/70 యాక్టు పరిధిలోకి పోతాయి. ఈ ప్రతిపాదనలు కూటమి పెద్దలు కేంద్రానికి పంపించకుండా అడ్డుకోకపోతే ఆ రెవెన్యూ గ్రామాల్లో నివాసం ఉండే గిరిజనేతరులు సర్వం కోల్పోతారు. 1/70 యాక్టు పరిధిలోకి విలీనం అయితే పూర్వం నుంచి జీవనం సాగిస్తున్న గిరిజనేతరుల భవిష్యత్తు అగోమ్యగోచరంగా తయారౌవుతుంది. షెడ్యూలు ఏరియాలోకి మార్పు చేస్తే అక్కడ కేవలం గిరిజనులకు తప్ప నివాసం ఉండడానికి సైతం నిబంధనల ప్రకారం ఎలాంటి హక్కులు ఉండవు. పూర్వం నుంచి సాగు చేస్తున్న జిరాయితీ భూములు సైతం గిరిజనేతరులు పూర్తిగా కోల్పోయే అవకాశం ఉంటుంది. 12 రెవెన్యూ గ్రామాల్లో రెండు మండలాల్లో 6వేల నుంచి 8 వేలు మధ్య జిరాయితీ భూములు ఉన్నాయి. ఆ భూములు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజనేతరులు హక్కులు కోల్పోతారు. గిరిజనేతరులకు ఇళ్లు, ఇతర ఆస్తులు సైతం షెడ్యూలు ఏరియాలోకి మార్పు చేస్తే క్రయ విక్రయాలు నిలిచిపోతాయి. అక్కడ గిరిజనేతరులకు ఉన్న స్థిరాస్తులన్నీ పూర్తిగా కోల్పోయి కుటుంబాలన్నీ రోడ్డున పడే ప్రమాదం ఉంది.

స్పీకరు దృష్టికి సమస్య

1/70 యాక్టు పరిధిలోకి మార్పు చేయకుండా నిలుపుదల చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు ముఖ్య నాయకులు స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాంతంపై సరైన అవగాహన లేని అధికారులు మైదానంలో ఉండే ఈ 12 రెవెన్యూ గ్రామాలను షెడ్యూలు పరిధికి మార్పు చేసేందుకు ప్రతిపాదనలు చేశారన్నారు. ఇక్కడ గిరిజన జనాభా తక్కువగా ఉన్నారని, భూములు కూడా తక్కువే ఉన్నాయన్నారు. 95శాతం పైగా గిరిజనేతరులు నివాసంతో పాటు స్థిర ఆస్తులు కలిగి ఉన్నారన్నారు. ప్రభుత్వం వద్ద ఉన్న ప్రతిపాదనలు కేంద్రానికి పంపించకుండా అడ్డుకోకపోతే వందలాది కుటుంబాల గిరిజనేతరులు రోడ్డున పడతారన్నారు. అక్కడ గిరిజనలకు తప్ప గిరిజనేతరులకు ఎలాంటి హక్కులు ఉండవు. స్థానిక సంస్థలు ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ పదవులు సైతం గిరిజనులే పోటీ చేయాలి. ఇక్కడ గిరిజనేతరులకు పోటీ చేసే అర్హత కూడా ఉండదని తెలిపారు.

నా చేతిలో ఏమీలేదు..



మండలంలో మూడు రెవెన్యూ గ్రామాలను 1/70 యాక్టు పరిధిలోకి మార్పు చేసేందుకు నేను రాకముందు పాడేరు ఐటీడీఏ అధికారి ద్వారా ప్రతిపాదనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రానికి పంపించేస్తే మారిపోతుంది. ఇప్పుడు నాచేతిలో ఏమీ లేదు. ప్రభుత్వం నుంచి ఏదైనా సూచనలు వస్తే తప్ప ఇక్కడ నేను చేయాల్సింది ఏమీ లేదు.

– ఎ.వేణుగోపాల్ తహసీల్దార్

గిరినేతరులకు అన్యాయం జరిగితే ఉద్యమిస్తాం



కూటమి ప్రభుత్వం గిరిజనేతరులకు ఎలాంటి హాని తలపెట్టినా ఉద్యమిస్తాం. పూర్వం నుంచి సాగు చేసుకుంటున్న రైతులు వ్యవసాయ భూములు ఇప్పుడు 1/70 యాక్టు పరిధిలోకి మార్పు చేస్తే వారంతా ఏమైపోతారు? ఏళ్లతరబడి కుటుంబ సభ్యులు అన్నదమ్ముల్లా కలిసి ఉంటున్న గిరిజనులు, గిరిజనేతరులు మధ్య చిచ్చుపెట్టినట్టు అవుతుంది. కూటమి నేతలు ఈ విషయంపై దృష్టి సారించండి.. లేదంటే తర్వాత పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. ఆ గ్రామాలను ఎలాంటి మార్పులు చేయరాదు.

– ఆడిగర్ల రాజు, సిపియం జిల్లా కమిటి సభ్యుడు

కీచక ఉపాధ్యాయుడికి రిమాండ్

- కేంద్ర కారాగారానికి నిందితుడు తరలింపు
- వేధింపు ఘటనలను అరికట్టడానికి షీ టీమ్స్
- పాఠశాలల్లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలి
- ఎస్పీ తుహిన్ సిన్హా

బుచ్చెయ్యపేట : ఉన్నత పాఠశాల విద్యార్థిని పట్ల లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో నిందితుడైన ఉపాధ్యాయుడిని రిమాండ్ నిమిత్తం విశాఖ కేంద్ర కారాగారానికి తరలించినట్టు అనకాపల్లి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ తుహిన్ సిన్హా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో బుచ్చెయ్యపేట మండలం వడ్డాది గ్రామంలోని ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని పట్ల అదే పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు ద్వారపూడి గంగా ప్రసాద్ లైంగిక వేధింపులకు పాల్పడడం, ఆమె తల్లిదండ్రులకు విషయం తెలియడంతో గురువారం నిందితుడిని పట్టుకుని నిలదీయడం, అటుపై పోలీసుల రంగప్రవేశంతో పోలీస్ స్టేషన్‌కు తరలించిన సంగతి పాఠకులకు విదితమే. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు 14 ఏళ్ల బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమో దు చేసి, శుక్రవారం చోడవరం కోర్టుకు తరలించగా నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించారన్నారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు విశాఖ కేంద్ర కారాగారానికి నిందితుడిని తరలించినట్టు ఆయన తెలిపారు. ఈ ఘటన చోటు చేసుకున్న సందర్భంగా జిల్లా లోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాలికలు, అమ్మాయిలపై జరిగే నేరాల పట్ల అవగాహన సదస్సులను నిర్వహించి వారిని చైతన్య పరచాల్సిందిగా అన్ని పోలీస్‌స్టేషన్లకు ఆదేశాలు జారీ చేసినట్టు ఎస్పీ తెలిపారు. వేధింపుల ఘటనలను అదుపు చేయడానికి షీ టీమ్స్, పోలీసు ప్రత్యేక వాహనాలు గస్తీ తిరుగుతున్నాయని, సంఘటనకు బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని ఆయన హెచ్చరించారు.

సమగ్ర నీటి పథకాలకు ఏటా రూ.6 కోట్ల వ్యయం

- అక్రమ ఇసుక తవ్వకాలతో భూగర్భ జలాలపై ప్రభావం
- వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు
- జెడ్పీ సీఈవో నారాయణమూర్తి



కోటవురట్లలో అధికారులతో సమీక్షిస్తున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

కోటవురట్ల: విశాఖ ఉమ్మడి జిల్లాలో 45 సమగ్ర రక్షిత మంచి నీటి పథకాలు ఉన్నాయని, వీటి నిర్వహణకు ప్రతీ ఏటా రూ.6 కోట్లు వినియోగిస్తున్నట్టు జెడ్పీ సీఈవో నారాయణమూర్తి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సంఘం నిధుల వివరాలు, వినియోగంపై ఎంపీడీవో కాశీవిశ్వనాథరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంచినీటి సమస్య ఉత్పన్నం కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో భాగంగా వేసవిలో ఏ గ్రామంలో కూడా మంచినీటి ఎద్దడి రాకుండా సమగ్ర రక్షిత మంచినీటి ప్రాజెక్టులను సందర్శించి పనితీరు, సమస్యలు తెలుసుకుని నివారణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగానే గొట్టివాడ సమగ్ర రక్షిత మంచినీటి ప్రాజెక్టును పరిశీలించి సమస్యలు తెలుసుకున్నట్టు తెలిపారు. ఈ ప్రాజెక్టు నుంచి నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాలకు తాగునీరు అందుతోందని తెలిపారు. నదిలో అక్రమ ఇసుక తవ్వకాల కారణంగా వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి తాగునీటి సరఫరాకు ఇబ్బంది కలుగుతోందని గుర్తించామని తెలిపారు. ఇందుకోసం తహసీల్దారుకు నివారణ చర్యల కోసం ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. అలాగే విద్యుత్ సమస్య కూడా ఉందని సిబ్బంది తెలిపారని పరిష్కారానికి ఏపీఈపీడీసీఎల్ ఉన్నతాధికారులతో చర్చిస్తామని తెలిపారు. ప్రతీ మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల పరిషత్ ఆస్తుల వివరాలను గోడపై పొందుపరిచేలా చర్యలు తీసుకుంటున్నామని, మండల పరిషత్ ఆస్తులైన స్కూల్స్, సీసీ రోడ్లు, చేతిబోర్లు వంటి వివరాలను సమగ్రంగా గోడపై పొందుపరచాలని ఎంపీడీవోకు ఆదేశాలిచ్చారు.

మాఘపౌర్ణమి జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు



రేవుపోలవరం తీరంలో జాతర ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఎస్.రాయవరం: మండలంలోని రేవుపోలవరం తీరంలో ఈ నెల 12న నిర్వహించే మాఘపౌర్ణమి జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ జె. రమేష్‌బాబు సూచించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో జి.సత్యనారాయణ, అడ్డురోడ్డు సీఐ రామకృష్ణ, ఎస్. రాయవరం ఎస్ఐ విభీషణరావులతో కలిసి ఆయన శుక్రవారం రేవుపోలవరం తీరంలో పర్యటించారు. భక్తులు స్నానాలు ఆచరించే తీరం వద్ద మహిళలు వస్త్రాలు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు, తాత్కాలిక మరుగుదొడ్లు, సముద్రంలో లోపలకి వెళ్లకుండా గజ ఈతగాళ్ల ఏర్పాటు, ఎప్పటికప్పుడు భక్తులు తరలివెళ్లడానికి బస్సుల ఏర్పాటు, సొంత వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ వంటి సదుపాయాలుపై ముందుగా స్థల కేటాయింపులు చేయాలన్నారు. సీఐ రామకృష్ణ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులు, టూ వీలర్స్ వచ్చి వెళ్లేందుకు సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. గ్రామ సమీపంలో కొంత ఖాళీ స్థలం చదును చేస్తున్నామన్నారు.

స్టెమితో గుండెరోగులకు మెరుగైన వైద్యం

- గుండెపోటుకు గురైన వారికి సీహెచ్‌సీలో అందుబాటులో టెనెక్టిప్లెస్ ఇంజక్షన్
- వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం



కె.కోటపాడులో స్టెమిపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ శ్రీలక్ష్మి

కె.కోటపాడు : స్టెమి కార్యక్రమం ద్వారా గుండెపోటు సమస్య బారిన పడే వారికి సీహెచ్‌సీలో మెరుగైన వైద్యం అత్యంత కీలక దశలోనే అందనున్నట్టు కె.కోటపాడు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ శ్రీలక్ష్మి అన్నారు. ఆస్పత్రిలో శుక్రవారం స్టెమిపై వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. గుండెపోటు బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ మంచి ఆహారపు అలవాట్లు పాటించడంతో పాటు, వ్యసనాలకు దూరం ఉండాలని, ప్రతి రోజూ 45 నిమిషాల పాటు వ్యాయామం చేయడం మంచిదని ఆమె తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో గల వారు గుండెపోటుకు గురైతే వారిని మొదటి గంటలోపే సీహెచ్‌సీకి తీసుకురావాలని శ్రీలక్ష్మి తెలిపారు. వారికి ఈసీజీ, ప్రాథమిక పరీక్షలను నిర్వహించడం జరుగుతుందన్నారు. వారి ఆరోగ్య పరీక్షలను కార్డియాలజీ డాక్టర్‌కు ఆన్‌లైన్ ద్వారా ఆరోగ్య వివరాలు వివరించి వారికి గుండెపోటుగా ఉన్నత వైద్యుల నుంచి నిర్ధారణ అయితే పేషంట్ అంగీకారంతో రూ.45 వేలు విలువైన టెనెక్టిప్లెస్ ఇంజక్షన్‌ను ఇవ్వనున్నట్టు ఆమె తెలిపారు. తద్వారా గుండెపోటుకు గురైన వ్యక్తికి ఈ ఇంజక్షన్ ద్వారా కొంతమేర ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉంటుందన్నారు. వెంటనే ఆ పేషంట్‌ను మెరుగైన వైద్యం కోసం ఇతర ఆస్పత్రులకు తరలించడం జరుగుతుందన్నారు. గుండెపోటుకు గురైన వారికి ఛాతినొప్పి, ఎడమ చేయి లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండెదడ, స్పృహ కోల్పోయే లక్షణాలు ఉంటాయని ఆమె తెలిపారు. గుండెపోటు లక్షణాలు ఉన్నట్టయితే కె.కోటపాడు సీహెచ్‌సీలో స్టెమి ద్వారా మెరుగైన వైద్యం అందుతుందని వైద్య సిబ్బంది ప్రచారం చేయాలని ఆమె తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కూడా సీహెచ్‌సీలో స్టెమి వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఈ స్టెమిపై విస్తృత ప్రచారం కల్పించాలని శ్రీలక్ష్మి సూచించారు. కార్యక్రమంలో వైద్యులు ప్రశాంత్, కోటేశ్వరరావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి

మాజీ ఎమ్మెల్సీ, ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడు



కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న పీఆర్టీయూ మద్దతు అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడు

మహారాణిపేట (విశాఖ): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను శక్తి వంచన లేకుండా పరిష్కరిస్తానని మాజీ ఎమ్మెల్సీ, ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీగా నామినేషన్ దాఖలు చేసిన తర్వాత కలెక్టరేట్ ప్రాంగణంలో శ్రీనివాసుల నాయుడు మీడియాతో మాట్లాడారు. గతంలో తాను ఎమ్మెల్సీగా పనిచేసిన సమయంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించడంలో కీలకంగా పని చేశానన్నారు. తనకు పలు ఉపాధ్యాయుల సంఘాల మద్దతు ఉందని తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సమీపంలోని ప్రైవేట్ ఫంక్షన్‌ హాలులో ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ, మిత్ర సంఘాలు ఏపీటీఎఫ్ 1938, ఏపీ యూఎస్, ఎస్టీయూ, ఏపీటీడబ్ల్యూటీఏ, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్, పీఈటీ అసోసియేషన్, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్(ఏపీటీఏ), గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ లెక్చరర్స్ అసోసియేషన్, కాంట్రాక్ట్ డిగ్రీ లెక్చరర్స్ అసోసియేషన్, జూనియర్ కాలేజ్ లెక్చరర్స్ అసోసియేషన్‌లు శ్రీనివాసులు నాయుడుకు మద్దతు ప్రకటించాయి. పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిట్ట కృష్ణయ్య, ఏఎం గిరిప్రసాద్ రెడ్డి, రాష్ట్రస్థాయి నాయకుడు వైష్ణవ కరుణానిధి, ఏపీటీఎఫ్(1938) రాష్ట్ర అధ్యక్షుడు హృదయ రాజు, ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఎస్టీయూ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఇమంది పైడిరాజు పాల్గొనగా.. పీఆర్టీయూ ఉమ్మడి జిల్లా కన్వీనర్ డి.గోపీనాథ్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు పి.వి.ఎన్.మాధవ్ సమావేశంలో పాల్గొని.. రాజకీయాలకు అతీతంగా.. ఉపాధ్యాయుల సమస్యలపై పట్టు ఉన్న గాదె శ్రీనివాసుల నాయుడును ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఆరు జిల్లాలకు సంబంధించిన అన్ని సంఘాల అధ్యక్ష కార్యదర్శులు హాజరయ్యారు.

ఎమ్మెల్సీ స్థానానికి ఐదో రోజు నాలుగు నామినేషన్లు

- ఇప్పటివరకు 8 నామినేషన్ల దాఖలు
- శని, ఆదివారం సెలవు, సోమవారం ఆఖరు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానానికి శుక్రవారం మరో నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో ఇప్పటి వరకు దాఖలైన నామినేషన్ల సంఖ్య 8కి చేరింది. పీఆర్టీయూ మద్దతుతో మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, స్వతంత్ర అభ్యర్థులు నూకల సూర్యప్రకాష్, రాయల సత్యనారాయణ, ఎస్సీ, ఎస్టీ బహుజన ఫోరం అభ్యర్థి పోతల దుర్గారావు తమ మద్దతుదారులతో కలిసి రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్‌కు సంబంధిత పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులతో కలెక్టర్ ప్రమాణం చేయించారు. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియకు గడువు కాగా.. ఇప్పటికే ఐదు రోజులు గడిచిపోయింది. రెండో శనివారం, ఆదివారం సెలవు కావడంతో సోమవారం ఒక్క రోజే ఇంకా నామినేషన్లు వేయడానికి గడువు ఉంది. ఇప్పటివరకు ఎనిమిది నామినేషన్లు దాఖలవ్వగా అభ్యర్థులు 14 సెట్లు సమర్పించారు. ఏఆర్వో, డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, నోడల్ అధికారి, వీఎంఆర్డీఏ ఎస్టేట్ అధికారి దయానిధి పాల్గొన్నారు.

పుట్టిన వెంటనే ఆడశిశువు మృతి

- వైద్య సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన
- కోటవురట్ల సీహెచ్‌సీలో ఘటన



విచారణ చేస్తున్న సూపరింటెండెంట్ ప్రసాద్



మృతి చెందిన ఆడ శిశువు



బాలింత సుశీలాదేవి

కోటవురట్ల : వైద్యుల నిర్లక్ష్యంతోనే పుట్టిన బిడ్డ మృతి చెందిందని బాలింత బంధువులు ఆరోపించారు. స్థానిక సీహెచ్‌సీలో చౌడువాడకు చెందిన గర్భిణి శనంశెట్టి సుశీలాదేవి మొదటి కానుపులో శుక్రవారం ఆడబిడ్డకు జన్మనివ్వగా కొద్ది నిమిషాలకే బిడ్డ మృతి చెందింది. దాంతో ఆగ్రహించిన బాలింత బంధువులు వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ మృతి చెందిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళనకు దిగగా విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు సిద్ధాబత్తుల సత్యనారాయణ ఆస్పత్రికి చేరుకుని బాలింత బంధువులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఇద్దరు గైనకాలజిస్టులు ఉండగా పుట్టిన బిడ్డకు రక్షణ లేదని, ఇలాగైతే ప్రభుత్వ ఆస్పత్రులకు పేదలు ఏ నమ్మకంతో వస్తారని సూపరింటెండెంట్ ప్రసాదును నిలదీశారు. సిబ్బంది నిర్లక్ష్యంతో ఓ నిండు ప్రాణాన్ని తీశారని మండిపడ్డారు. బాలింత సుశీలదేవి మేనమామ గోవిందరావు మాట్లాడుతూ కేవలం వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే పుట్టిన వెంటనే బిడ్డ మృతి చెందిందని ఆరోపించారు. తన మేనకోడలు సుశీలాదేవి మొదటి కానుపు కోసం బుధవారం ఆస్పత్రికి వచ్చి పరీక్షలు చేయించుకోగా అంతా బాగుందని, నార్మల్ డెలివరీ అవుతుంది ఆస్పత్రిలో చేరాలని చెప్పడంతో గురువారం ఉదయం 10.30 గంటలకు చేరినట్టు తెలిపారు. వైద్య పరీక్షలు చేసి ఇంజక్షన్లు చేశారని నార్మల్‌గానే ఉందని చెప్పారన్నారు. శుక్రవారం మధ్యాహ్నం గైనకాలజిస్టు డ్యూటీ మారడంతో వేరే డాక్టరు చేరారని, నెప్పులు రావడంతో నర్సులే కానుపు చేశారని దాంతో బిడ్డ ఉమ్మనీరు తాగి మృతి చెందిందని ఆరోపించారు. దీనికి ఆస్పత్రి వైద్య సిబ్బంది బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. దాంతో వైద్యులు తమ కారణంగా పొరపాటు జరిగిందని క్షమించాలని కోరారు. దీంతో బాలింత భర్త కట్టావీరబాబు, మేనమామ గోవిందరావు, బంధువులు శాంతించి ఆందోళన విరమించుకున్నారు. ఇకపై ఏ బిడ్డ ప్రాణం పోకుండా అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు సిద్ధాబత్తుల సత్యనారాయణ హెచ్చరించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో అటవీ ఉద్యోగి మృతి


పొట్టన్న (ఫైల్)

నర్సీపట్నం : నర్సీపట్నం శ్రీజంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అటవీ ఉద్యోగి మృతి చెందాడు. పాడేరు మండలం, సంతనేరళ్ల గ్రామానికి చెందిన ఆర్. పొట్టన్న (54) కొయ్యూరు మండలం, మర్రిపాకల రేంజ్ సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి నర్సీపట్నంలో నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం ఇంటి నుండి బైక్‌పై డ్యూటీ బయలుదేరారు. యూనిఫామ్ మర్చిపోవడంతో తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో పొట్టన్న బస్సు వెనకాల టైర్ల కింద పడిపోయాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుడి కుమారుడు అక్కడకు చేరుకుని తండ్రి మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. జరిగిన సంఘటనపై టౌన్ సీఐ గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

యలమంచిలి రూరల్ : మండలంలోని ఏటికొప్పాక శివారులో పేకాడుతున్న ముగ్గురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు యలమంచిలి రూరల్ పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం గ్రామ శివార్లకు వెళ్లిన పోలీసులకు అక్కడ పేకాడుతున్న వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 52 పేకముక్కలు, రూ.2300 నగదు స్వాధీనపర్చుకున్నారు. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. ఎక్కడైనా జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు ఈ సందర్భంగా హెచ్చరించారు.

96 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్


నిందితుడు, స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎస్ఐ ఈశ్వరరావు

అనకాపల్లి: పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యూ కాలనీలో 96 అక్రమంగా నిల్వ చేసిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ఈశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఇందుకు సంబంధించి నిందితుడు యాదగిరి శ్రీనివాస్‌ను పట్టుకొని అరెస్టు చేశామన్నారు. మద్యాన్ని అక్రమంగా నిల్వ చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.
మునగపాక : ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం సీసాలను రవాణా చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. వాడ్రాపల్లి గ్రామానికి చెందిన మళ్ల శేషు శుక్రవారం ఎటువంటి లైసెన్స్‌గాని, ప్రభుత్వ అనుమతులు లేకుండా 10 మద్యం సీసాలను రవాణా చేస్తున్నట్టు గుర్తించి అతనిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే రామగిరి శివారు గొలగాని చౌడయ్య ఎటువంటి అనుమతులు లేకుండా 12 మద్యం సీసాలను రవాణా చేస్తున్నట్టు గుర్తించి అతని పై కూడా కేసు నమోదు చేశామని ప్రసాదరావు తెలిపారు.

నీవే స్ఫూర్తి..యువతకు చైతన్య దీప్తి

కనులపండువగా వివేకానందుని శోభాయాత్ర


ర్యాలీలో పాల్గొన్న వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు


స్ఫూర్తి ప్రదాతతో ఎన్‌సీసీ క్యాడెట్ల సెల్ఫీ


ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

ఏయూక్యాంపస్/డాబాగార్డెన్స్: భారతీయ ఆధ్యాత్మిక శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన వివేకానంద స్వామి నేటి తరానికి నిజమైన స్ఫూర్తిగా నిలుస్తారు. వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో శోభాయాత్ర జరిగింది. ప్రభుత్వ మహిళా కళాశాల వద్ద ప్రారంభమైన ఈ యాత్ర బీచ్‌రోడ్డులోని రామకృష్ణ మిషన్ వరకు సాగింది. ముందుగా ఈ యాత్రను కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ప్రారంభించి మాట్లాడారు. వివేకానందుని స్ఫూర్తితో యువతరం ఉన్నతంగా రాణించాలని పిలుపునిచ్చారు. పెద్ద సంఖ్యలో యువత ఈ యాత్రలో పాల్గొనగా.. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు వివేకానందుని విగ్రహానికి పూలమాలలు, పుష్పాలు అర్పించారు. పలువురు విద్యార్థులు వివేకానందుడు, భారతమాత వేషధారణలో ర్యాలీలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వివేకానందుడి సూక్తులతో కూడిన ప్లకార్డులు పట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. నిలువెత్తు వివేకానందుని విగ్రహంతో యువత ఫొటోలు తీసుకోవడానికి ఆసక్తి చూపారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డి.సూర్య ప్రకాశరావు, రామకృష్ణ మిషన్ ఆశ్రమ కార్యదర్శి స్వామి స్వసమవేద్యానంద, రామకృష్ణ మిషన్ స్వామీజీ గీతాసకరానంద, ఎం.సత్యనారాయణ రాజు, ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల తదితరులు పాల్గొన్నారు.

మండు వేసవిలో చల్లని అనుభూతి

పోర్ట్ స్టేడియంలో స్నో స్టేషన్ ప్రారంభం


జారుడు బల్లపై జారుతున్న చిన్నారి

విశాఖ స్పోర్ట్స్: వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి నీటిలో ఆటలాడటం సహజం. కానీ మండుటెండల్లో మంచుతో ఆడుకునే అవకాశం వస్తే ఎలా ఉంటుంది? విశాఖ వాసులకు సరిగ్గా అలాంటి అద్భుత అనుభూతిని అందించడానికి నగరం నడిబొడ్డున, పోర్టు స్టేడియంలో 'స్నో స్టేషన్'పేరుతో సరికొత్త మంచు వినోద కేంద్రం రూపుదిద్దుకుంది. దేశంలో కొన్ని నగరాల్లో ఇలాంటి కేంద్రాలు ఉన్నప్పటికీ, రాష్ట్రంలో మాత్రం ఇదే మొదటిది కావడం విశేషం. సుమారు 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ స్నో స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో 12 అడుగుల మందంతో మంచును పరచగా, మొత్తం నిర్మాణం 35 అడుగుల ఎత్తులో ఉంటుంది. కళా దర్శకుడు రవి(దసరా సినిమా ఫేం) ఈ స్నో స్టేషన్ లోపలి భాగాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. సందర్శకులు మంచుపై బాల్ గేమ్స్ ఆడటమే కాకుండా, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంచు వాలుపై జారిపోతూ సరికొత్త అనుభూతిని పొందవచ్చు. ఈ స్నో స్టేషన్‌లో ప్రవేశించడానికి పెద్దలకు ఒక్కొక్కరికి రూ.799, పిల్లలకు రూ. 649గా టికెట్ ధర నిర్ణయించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు తెరిచి ఉండే ఈ వినోద కేంద్రంలో గంట సమయం చొప్పున స్లాట్లు కేటాయించారు. లోపలి చలి వాతావరణాన్ని తట్టుకోవడానికి చేతి గ్లోవ్స్, బూట్లు వంటివి నిర్వాహకులే అందిస్తారు. ఒక్కసారి లోపలికి వెళ్తే చాలు గంటసేపు చల్లటి వాతావరణంలో సరదాగా గడపవచ్చు. విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ స్నో స్టేషన్‌ను విశాఖ పోర్ట్ అథారిటీ చైర్మన్ మాధయ్యన్ అంగముత్తు శుక్రవారం ప్రారంభించారు

300 మందికి ఉపాధి

విశాఖ పర్యాటకంగా అభివృద్ధి చెందుతోంది. పర్యాటకులను ఆకర్షించేందుకు మరో హంగుగా స్నో స్టేషన్‌ను ఏర్పాటు చేశాం. రాష్ట్రంలోనే ఇది మొదటి మంచు స్టేషన్. పోర్ట్ స్టేడియంలో విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ ఆటలతో పాటు అడ్వెంచర్ యాక్టివిటీస్‌ను ఏర్పాటు చేశాం. ఇక్కడ గో కార్ట్ ట్రాక్ కూడా ఉంది. ఎక్కడెక్కడి నుంచో వచ్చే సందర్శకులకు ఇది ఒక వినోద గమ్యస్థానంగా తీర్చిదిద్దాం. దాదాపు 300 మందికి ఉపాధి కల్పిస్తున్నాం.
– కె.ప్రమోద్, ఎండీ, స్నో స్టేషన్

పనుల అంచనాలు రూపొందించండి

విశాఖ సిటీ: రానున్న ఆర్థిక సంవత్సరంలో ఇంజినీరింగ్ పనుల అంచనాలను సమగ్రంగా రూపొందించాలని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో పరిపాలన, రెవెన్యూ, అలాట్‌మెంట్, సాంకేతిక, ప్రణాళిక విభాగాల అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పార్కుల్లో రక్షణ చర్యల్లో భాగంగా సీసీ కెమెరాలు తప్పకుండా పనిచేసేలా చూడాలన్నారు. ప్రణాళిక విభాగంలో భూ వినియోగ మార్పిడి దరఖాస్తులను, సిబ్బంది వ్యక్తిగత లాగిన్‌లో ఉన్న దస్త్రాలను సాధ్యమైనంత త్వరగా క్లియర్ చేయాలని ఆదేశించారు.

అప్పుల బాధతో యువకుడి బలవన్మరణం



వేముల దుర్గాప్రసాద్(ఫైల్)


కశింకోట: అప్పుల బాధ తాళలేక ఓ యువకుడు ఉరి పోసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కశింకోటలోని పూసర్ల వీధిలో చోటు చేసుకుంది. సీఐ అల్లు స్వామినాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక పూసర్ల వీధిలో అద్దెకు నివాసం ఉంటున్న వేముల దుర్గాప్రసాద్(25) పరవాడలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. అప్పులతో సతమతమవుతున్న ఆయన ఇంట్లో ఫ్యాన్‌కు గురువారం రాత్రి ఉరి పోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి అంకమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం చేసి అప్పగించినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతునికి భార్య యమున, కుమారుడు జగన్నాథం ఉన్నారు.

ఇన్‌స్టాగ్రాంలో పరిచయంతో వివాహం

మృతుని సొంత గ్రామం ఎన్టీఆర్ జిల్లా మైలవరం. దుర్గాప్రసాద్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడి ప్రేమగా మారడంతో యమునను మూడేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరు విజయవాడలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. అయితే అక్కడ సరిగ్గా పని లభించకపోవడంతో మూడు నెలల క్రితం కశింకోటకు వచ్చి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో పరవాడలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో కార్మికునిగా చేరాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా దుర్గాప్రసాద్ ఆత్మహత్య చేసుకున్నాడని, తమ మధ్య ఏ విధమైన వివాదాలు లేవని తల్లి అంకమ్మ, భార్య యమున చెప్పినట్టు సీఐ తెలిపారు.

బ్యాంకు రుణం కోసం పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ


ఫోర్జరీ సంతకం చేసి శ్రీను బ్యాంక్ ఉద్యోగులకు ఇచ్చిన సర్టిఫికెట్


గోపాలపురం పంచాయతీ కార్యదర్శి జగదీష్ ఒరిజినల్ సంతకం, స్టాంప్

అనకాపల్లి: బ్యాంకు రుణం కోసం పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసిన ఘటన మండలంలోని గోపాలపురం పంచాయతీలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గోపాలపురం కాలనీలో ఇల్లు నిర్మించుకుని గొర్లి శ్రీను అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. ఈయన ఇల్లు కోడూరు పంచాయతీ రెవెన్యూ పరిధిలోకి వస్తుంది. అయితే గోపాలపురం పంచాయతీ కార్యదర్శి సీహెచ్.జగదీష్ వద్దకు వెళ్లి గృహానికి బ్యాంక్ ద్వారా లోన్ తీసుకుంటానని శ్రీను చెప్పాడు. ఇది తన పరిధిలోకి రాదని, కోడూరు రెవెన్యూ పరిధిలో వస్తుందని, తాను ఆస్తి ధ్రువీకరణ పత్రం ఇవ్వలేనని శ్రీనుకు జగదీష్ చెప్పారు. శ్రీను కోడూరు పంచాయతీ కార్యదర్శిని సంప్రదించకుండా బ్యాంక్ ద్వారా ఎలాగైనా రుణం తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ మేరకు విశాఖలోని ఓ బ్యాంక్‌కు వెళ్లి ఆయన సంప్రదించాడు. బ్యాంక్ సిబ్బంది అవసరమైన సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు. గోపాలపురం పంచాయతీ కార్యదర్శిని మళ్లీ సంప్రదించగా.. ఆస్తి ధ్రువీకరణ పత్రం ఇవ్వడానికి నిరాకరించారు. దీంతో శ్రీను గోపాలపురం పంచాయతీ కార్యదర్శి పేరుతో రబ్బరు స్టాంప్ తయారు చేయించాడు. ఆస్తి ధ్రువీకరణ పత్రంపై ఫోర్జరీ సంతకం చేసి బ్యాంకు ఉద్యోగులకు అందించాడు. బ్యాంక్ ఉద్యోగులు ఈ నెల 4న వెరిఫికేషన్ నిమిత్తం గోపాలపురం పంచాయతీ కార్యదర్శి సీహెచ్.జగదీష్ వద్దకు వచ్చి మీరు ఇచ్చిన సర్టిఫికెట్‌పై ప్రకారం ఎంత రుణం ఇవ్వాలని కోరారు. ఈ సంతకం తనది కాదని బ్యాంక్ ఉద్యోగులకు చెప్పడంతో వారంతా నివ్వెరపోయారు. శ్రీను ఇచ్చిన ధ్రువీకరణ పత్రం పరిశీలించగా సిహెచ్.జగదీష్‌కు బదులుగా జి.జగదీష్‌గా ఉన్నట్లు గుర్తించారు. దీనిపై గోపాలపురం పంచాయతీ కార్యదర్శి సీహెచ్.జగదీష్ అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 5న ఫిర్యాదు చేశారు. దీనిపై పూర్తి స్థాయిలో ఇప్పటి వరకూ ఎటువంటి విచారణ జరగలేదు.

ఘనంగా 'స్పందన' యువజనోత్సవాలు


శాంతి కపోతాలు ఎగురవేస్తున్న విజయ్ ప్రకాష్, తదితరులు

పాయకరావుపేట: స్థానిక స్ప్రెసెస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం స్పందన యువజనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఆటపాటలతో, నృత్యాలతో సందడి చేశారు. సంగీతం, సాహిత్యం, నృత్యం, థియేటర్ ఆర్ట్స్, ఫైన్ ఆర్ట్స్, క్రీడలు, తదితర సుమారు 30 అంశాలలో విద్యార్థి, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేడుకలను శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, మోడరేటర్ జి.గ్లోరియా, ఏపీ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ జూనియర్ లెక్చరర్ హంసవరం, తదితరులు శాంతి కపోతాలు ఎగురవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మోడరేటర్ గ్లోరియా నిర్వహించిన ప్యానల్ డిస్కషన్‌లో కెరియర్‌లో సాఫ్ట్ స్కిల్స్ పాత్ర అనే అంశంపై విద్యార్థులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఈ సందర్భంగా విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి స్పందన ఒక వేదికగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ హెచ్ఆర్ వీవీఎస్‌బీ బంగ్రారాజు, వైస్ ప్రిన్సిపాల్ పెనుగొండ సుబ్బారావు, విద్యార్థులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎం.కోటపాడు చోరీ కేసులో దొంగ దొరికాడు..

- ఐదు రోజుల్లో కేసు ఛేదించిన పోలీసులు
- నిందితుడి నుంచి నగదు, నగలు స్వాధీనం
- ఎస్ఐని అభినందించిన డీఎస్పీ శ్రావణి


కేసుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రావణి, ఎస్ఐ నారాయణరావు తదితరులు

మాడుగుల : ఈ నెల 2వ తేదీన రాత్రి మాడుగుల మండలం ఎం.కోటపాడు గ్రామం సుంకర రాము నాయుడు ఇంట్లో దొంగతనం జరిగి నగదు, బంగారు వస్తువులు, వెండి దొంగ లించబడడం విషయం తెలిసిందే. అయితే అనకాపల్లి ఉప విభాగం డీఎస్పీ ఎం.శ్రావణి ఆదేశాల మేరకు ఎస్ఐ జి.నారాయణరావు బృందం దర్యాప్తు ముమ్మరం చేసి కేవలం ఐదు రోజులులో కేసు ఛేదించారు. ఈ మేరకు శుక్రవారం సాయంకాలం మాడుగుల స్టేషన్‌కు వచ్చిన డీఎస్పీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అదే గ్రామం ఎం.కోటపాడులో అనుమానితుడు నాతల రాజేష్, అలియాస్ మనోహర్, అలియాస్ పాండూను శుక్రవారం పట్టుకుని అతని వద్ద నుండి రూ లక్షా 42 వేలు నగదు, 21.32 గ్రాముల బంగారం, 1406 గ్రాముల వెండి స్వాధీనం చేసుకుని అనుమానితుడిని అరెస్టు చేశామని ఆమె తెలిపారు. చాకచక్యంగా తక్కువ రోజుల్లో కేసు ఛేదించిన ఎస్ఐ జి. నారాయణరావుతో పాటు దర్యాప్తు బృందాన్ని అనకాపల్లి ఉప విభాగం డీఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు వేర్వేరు చోరీల్లో నిందితుడి అరెస్టు

అనకాపల్లి : మండలంలోని బవులువాడ గ్రామం, రిక్షా కాలనీల్లో జరిగిన వేర్వేరు దొంగతనాలకు పాల్పడిన నిందితుడు సిమ్మ నాగరాజు(36)ను పట్టుకొని శుక్రవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ శ్రావణి తెలిపారు. అతని వద్ద నుంచి చోరీ సొత్తు ముప్పావు తులం బంగారు ఆభరణాలు, రూ.20 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఇక్కడ విలేకరులకు వివరిస్తూ.. ఎటువంటి ఆధారాలు లేని రెండు దొంగతనం కేసులను ఛాలెంజ్‌గా తీసుకొని సీఐ, ఎస్ఐ, సిబ్బంది కష్టపడి ఆధారాలు సేకరించారన్నారు. 2023లో బవులువాడ గ్రామం, రిక్షా కాలనీల్లో జరిగిన దొంగతనాల్లో ముప్పావు తులం బంగారు ఆభరణాలతో పాటు రూ.20 వేల నగదు అపహరణకు గురైందన్నారు. దీన్ని బవులువాడ గ్రామానికి చెందిన సిమ్మ నాగరాజు అపహరించినట్టు గుర్తించి అతన్ని పట్టుకొని అరెస్టు చేశామన్నారు. అతని నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నామన్నారు.


స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం కేసులో ఇద్దరి అరెస్ట్


కేసు వివరాలు వెల్లడిస్తున్న నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు

పాయకరావుపేట: పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పార్కులోని అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసిన ఇద్దరు వ్యక్తుల్ని గుర్తించి అరెస్ట్ చేసినట్లు నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఈ నెల ఒకటో తేదీ రాత్రి ఇద్దరు యువకులు గంజాయి మత్తులో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారన్నారు. వీరికి మరో వ్యక్తితో ఉన్న విరోధం కారణంగా ఆయనపై నేరం మోపుదామనే నేపంతో విగ్రహం ధ్వంసం చేశారని తెలిపారు. సీఐ జి.అప్పన్న చొరవ తీసుకుని రోజూ పార్కుకు వెళ్తున్న వారిని విచారించి, పార్కుకు వెళ్లే మార్గంలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించారన్నారు. అక్కడ ఉన్న ఫోన్ డంప్ కాల్స్ లిస్ట్ పరిశీలించి, ప్రత్యక్ష సాక్షులను విచారించారని చెప్పారు. ఇద్దరూ కలిసి విగ్రహం ధ్వంసం చేసినట్లు నిర్ధారణ జరిగిందన్నారు. గురువారం తాండవ సుగర్ ఫ్యాక్టరీ వద్ద గల చెక్ పోస్టు వద్ద పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా పట్టణంలోని దుర్గా కాలనీకి చెందిన వ్యక్తులుగా గుర్తించామన్నారు. వీరిలో ఒకరు మైనర్ అని, ఆయనను జువైనల్ హోంకు, మరో ముస్లిం యువకుడిని రిమాండ్‌కు తరలించామన్నారు. వారిపై అట్రాసిటీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశామన్నారు. తక్కువ కాలంలో నిందితుల్ని పట్టుకున్న సీఐ జి.అప్పన్నకు, పోలీసు సిబ్బందికి ఎస్పీ తుహిన్ సిన్హా అభినందనలు తెలిపినట్టు డీఎస్పీ తెలిపారు.

క్యా'బాతు'హై



మండలంలో గల కస్పా ఆర్అండ్‌బీ రోడ్డులో బాతులు బారులు తీరాయి. తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన పలువురు వడ్డాది గౌరీపట్నం మధ్యలో ఉన్న కస్పా పొలాల్లో వ్యానులపై బాతులును తీసికొచ్చి పంట పొలాల్లో మేపుతూ జీవనం సాగిస్తున్నారు. పంట పొలాల్లోనే గుడిసెలు వేసికుని బాతులను కస్పా పొలాల్లో మేపుతున్నారు. మంగళవారం వేలాది బాతులు కస్పా ఆర్అండ్‌బి రోడ్లుపైన, పంట పొలాల్లో తిరుగుతూ గుంపులుగా విహరిస్తూ కనువిందు చేశాయి.
– బుచ్చెయ్యపేట



పంటల్లో తెగుళ్ల ఉధృతి అరికట్టాలి

అనకాపల్లి : వాతావరణంలో వరిలో ఆకు ముడత, కాండం తొలిచే పురుగు ఆశించే అవకాశం ఉన్నందున నివారణకు అసిఫేట్ 1.5 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివి.

వాతావరణ పరిస్థితులకు రసంపీల్చు పురుగుల ఉధృతి పెరిగి పల్లాకు తెగులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున తెగులు సోకిన మొక్కలను పీకి నాశనం చేయాలి. తెగులు వ్యాప్తి కారకాలైన రసం పీల్చు పురుగుల నివారణకు డైయితోయేట్ 2.0 మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

➡ అపరాలలో మారుకా మచ్చల పురుగు ఆశించే అవకాశం ఉంది. రెక్కల పురుగుల ఉనికిని గమనించాలి. కోరిపైరిఫాస్ 2.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్టయితే ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పురుగు తీవ్రత ఎక్కువగా ఉంటే 7-10 రోజుల వ్యవధిలో మందులు మార్చి మార్చి కొట్టాలి.

➡ వేరు శనగ పంటలో రసం పీల్చు పురుగులు ఆశించే అవకాశం ఉన్నందున నివారణకు వేపనూనె 5 మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి. వెర్రి తెగులును వ్యాప్తి చేసే దీపపు పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ లేదా ఎసిటామిప్రిడ్ 0.3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. మచ్చెలు నాటిన 3 రోజుల లోపు అట్రాజిన్ 50 శాతం పొడి మందును ఎకరానికి 2 కిలోలు లేదా మెట్రిబుజిన్ 600 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పొలమంతా పిచికారీ చేసి ఒక నెల వరకు కలుపు నివారించుకోవచ్చు. చాళ్ల మధ్యలో జనుము విత్తుకుని 40 రోజులకు కలియ దున్నాలి.

➡ చెరకు నాటే ముందు ఎకరాకు కార్బొఫ్యూరాన్ 3 జి 13 కిలోలు లేదా ఫిప్రొనిల్ 0.3 జి 10 కిలోలు లేదా క్లొరాంటినిల్ 0.4 జి 9 కిలోలు చొప్పున చాళ్లల్లో 1.2 నిష్పత్తిలో ఇసుకతో కలిపి వేసినట్టయితే పీక పురుగు ఉధృతిని తగ్గించవచ్చు.

➡ మిరపలో నల్లి , తామర పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున నివారణకు ఫిప్రొనిల్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. జీడి, మామిడిలో టీ దోమ ఆశించే అవకాశం ఉన్నందున నివారణకు మొదటిసారి కొత్త చిగురు వచ్చే సమయంలో మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ కామప్ ఆక్సీక్లోరైడ్ 2.5 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. రెండోసారి పూత వచ్చిన తరువాత క్లోరిపైఫాస్ 2.5 మి.లీ కాపర్ ఆక్సీక్లోరైడ్ 2.5 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

క్లుప్తంగా

వెదురుపర్తిలో 'విద్యార్థి మేలుకో'



తల్లిదండ్రులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తున్న హెచ్‌ఎం మూర్తి

కశింకోట: మండలంలోని వెదురుపర్తి గ్రామంలో 'విద్యార్థి మేలుకో' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి హైస్కూలు హెచ్‌ఎం ఎ.వి.ఎస్ మూర్తి, ఉపాధ్యాయ సిబ్బంది టెన్త్ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి చదువు తీరును పరిశీలించారు. వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎస్‌ఏ 1 పరీక్షల మార్కులతో ప్రోగ్రెస్ కార్డులను విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశారు. పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, పౌష్టిక ఆహారాన్ని అందజేశారు.

అధిక లోడు క్వారీ లారీలపై కేసులు



సీజ్ చేసిన క్వారీ లారీ

అనకాపల్లి: అధిక లోడుతో ప్రయాణించే క్వారీ లారీలపై ఉన్నత స్థాయి అధికారులు ఆదేశాల మేరకు కేసులు నమోదు చేస్తున్నామని ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ తెలిపారు. గురువారం రాత్రి పట్టణంలో అధిక లోడుతో వెళ్తున్న రెండు లారీలను పట్టుకుని ఆర్టీవో షేక్ ఆయిషాకు అప్పగించగా, ఆమె రూ.1.24 లక్షల జరిమానా విధించారన్నారు. పరిమితికి మించి లారీలో ఓవర్ లోడ్ వెళ్లడం ద్వారా వాహనాలు పాడైపోవడమే కాకుండా రోడ్లు మరమ్మతులకు గురవుతున్నట్లు చెప్పారు. కొన్ని లారీల నుంచి పెద్దపెద్ద బండరాళ్లు రహదారులపై పడిపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిస్టు

కశింకోట: శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఫౌండేషన్ నుంచి హాజరైన వైద్యుడు శ్రావణ్ శక్తి, ఆప్తాలమిస్టు విద్యార్థులను పరీక్షించి కళ్లద్దాలు అవసరమైన వారిని గుర్తించారు. వారికి ఉచితంగా కళ్లద్దాలు అందివ్వనున్నట్లు శ్రావణ్ శక్తి తెలిపారు. హెచ్‌ఎం ఎం.ఆర్.వి. అప్పారావు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో శిబిరం సమన్వయకర్త కె. ప్రసాద్, సహాయకులు లావణ్య, లక్ష్మి, కార్తీక్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 7,008 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,800	4,600
మొదటి రకం	3,400	4.130
రెండో రకం	3,090	3,660
మూడో రకం	2,750	3,070

అనకాపల్లి సినిమాలు

డాకు మహారాజ్	రాజా
పుష్ప-2	సత్యనారాయణ స్క్రీన్-1
ఒక పథకం ప్రకారం	సత్యనారాయణ స్క్రీన్-2
తండేల్	పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	షిర్డీసాయి
పట్టుదల	వెంకటేశ్వర
గేమ్ ఛేంజర్	శ్రీసత్య (ఉదయం, మొదటి షో)
మదగజరాజ	శ్రీసత్య(మేట్నీ, రెండో షో)
భవాని వార్డు	రామచంద్ర

రక్త నిల్వలు


అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 92 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-30 యూనిట్లు, ఓ పాజిటివ్-48 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 344 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 265 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

శిథిలావస్థలో బస్సు షెల్టర్లు

- పెచ్చులూడుతున్న శ్లాబ్‌లు
- పట్టణ బస్టాప్‌ల వద్ద వసతుల లేమి
- ప్రయాణికుల ఇక్కట్లు
- రాత్రిళ్లు చీకట్లోనే నిరీక్షణ



నెహ్రూ చౌక్ బస్టాప్‌లో సీలింగ్ ఫ్యాన్లు లేకుండా ఉన్న గొట్టాలు



శిథిలావస్థకు చేరిన బాలకృష్ణ బస్టాప్



నెహ్రూ చౌక్‌లో బస్టాప్‌లో విద్యుత్ బోర్డు

అనకాపల్లి: పట్టణంలో బస్సు షెల్టర్లు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. చోడవరం బస్సు షెల్టర్, సత్యనారాయణ థియేటర్ వద్ద బాలకృష్ణ బస్సు షెల్టరు ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. దాంతో బస్సుల కోసం ఎండా వాన కాలంలో ప్రయాణికులు రోడ్లపైనే గంటల కొద్దీ నిరీక్షిస్తున్నారు. నెహ్రూ చౌక్ వద్ద అనకాపల్లి -విశాఖ, విజయనగరం వెళ్లే బస్టాప్‌లో నిత్యం వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫ్యాన్లు తిరగడం లేదు. రాత్రి సమయంలో విద్యుత్ దీపాలు సరిగ్గా వెలగడం లేదు. ఆర్టీసీ , జీవీఎంసీ అధికారులు కనీస సదుపాయాలు కల్పించకుండా చోద్యం చూస్తున్నారు.

శిథిలావస్థలో చోడవరం, బాలకృష్ణ బస్టాప్‌లు...

చోడవరం రహదారిలో బస్సు షెల్టరుతో పాటు విశాఖ రోడ్లలోని బాలకృష్ణ బస్సు షెల్టర్లు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. వర్షాలు కురిసినప్పుడల్లా కారిపోతున్నాయి. దీంతో బస్సుల కోసం నిరీక్షించే ప్రయాణికులు తడిసిముద్దవుతున్నారు. 35 ఏళ్ల క్రితం నిర్మించిన వీటిని పట్టించుకునే నాథుడు లేడు. పూర్తి పట్టుతప్పి ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పెచ్చులు ఊడిపడుతున్నాయి. శ్లాబ్‌తో పాటు గోడలు బీటలు వారి ఉన్నాయి. ప్రయాణికులు లోపల ఉండలేక బయట ఎండలో నిలబడలేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.

అంధకారంలో ప్రయాణికులు...

నెహ్రూచౌక్ బస్టాప్‌లో విశాఖ, విజయనగరం, పర్లాకిమిడి వైపు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ఏడు సంవత్సరాలు క్రితం నిర్మించిన బస్సు షెల్టర్‌తో రూపురేఖలు మారిపోయాయి. మొదట్లో బెంచీలతో పాటు ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. తర్వాత నిర్వహణ గాలికి వదిలేశారు. వేసవికాలం కావడంతో ఫ్యాన్లు తిరగక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం ఏడు దాటితే అంధకారం అలుముకుంటోంది. బస్సు షెల్టర్ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ఇక్కడ విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో రాత్రిళ్లు బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు చీకట్లో నిల్చోవాల్సి వస్తోంది. దీనికి తోడు మంచినీటి సౌకర్యం లేక తిప్పలు పడుతున్నారు.

పెరుగుబజార్ జంక్షన్ వద్ద షెల్టరు లేక ఇబ్బందులు..



పెరుగుబజార్ జంక్షన్ బస్టాప్ వద్ద బస్సుల కోసం వేచియున్న ప్రయాణికులు

పట్టణంలోని పెరుగు బజార్ జంక్షన్ వద్ద చిన్నపాటి బస్సు షెల్టరు ఏర్పాటు చేయాలి. గవరపాలెం నుంచి మునగపాక మండలం తోటాడ గ్రామం, గాంధీబొమ్మ జంక్షన్, మల్లవీధి, ఇతర ప్రాంతాల ప్రయాణికులు పెరుగుబజార్ బస్టాప్‌కు వచ్చి విశాఖ, విజయనగరం వైపు వెళ్లే బస్సులను ఎక్కుతారు. ఇక్కడ ప్రయాణికులు ఎండా వాన అనే తేడా లేకుండా ప్రయాణించడం తప్పడం లేదు. కనీసం ఎండా కాలంలోనైనా ఇక్కడ కమ్మల పందిళ్లు అయినా ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రయాణికులు కోరుతున్నారు. దీనిపై జీవీఎంసీ, ఆర్టీసీ అధికారులు దృష్టి పెట్టాలి.

నెహ్రూచౌక్ బస్టాప్ వద్ద నిలబడలేకపోతున్నాం



పనులపై చుట్టు పక్కల గ్రామాలతోపాటు విశాఖ, విజయనగరం వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. నెహ్రూ చౌక్ బస్టాప్‌లో చెత్తా చెదారం, బోర్డులతో నిండిపోయింది. టీడీపీ పాలనలో నిర్మించిన బస్టాప్ శిథిలావస్థకు చేరుకుంది. ప్రయాణికులు కూర్చొనే ప్రదేశంలో ఫ్యాన్లు లేకుండా పోయాయి. రాత్రి సమయంలో ఇబ్బందికరంగా ఉంటోంది.

– కె.అప్పారావు, గవరపాలెం, అనకాపల్లి

బాలకృష్ణ బస్టాప్ కొత్తగా నిర్మించాలి



అనకాపల్లి మున్సిపాలిటీని జీవీఎంసీలో విలీనం చేసిన తర్వాత బస్టాప్‌ల అభివృద్ధి చేయడంలో అధికారులు విఫలమయ్యారు. బాలకృష్ణ బస్టాప్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఈ స్థలాన్ని కొంతమంది వ్యక్తులు ఆక్రమించేందుకు సిద్ధంగా ఉన్నారు. మునగపాక మండలం తోటాడ నుంచి విశాఖ, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు గవరపాలెం మీదుగా బాలకృష్ణ బస్టాప్‌కు చేరుకుంటారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని శిథిలావస్థకు చేరిన బాలకృష్ణ బస్టాప్‌ను పునర్నిర్మించాలి.

– బొట్టా చిన్నయాదవ్, అనకాపల్లి



బీటలు బారిన నెహ్రూ చౌక్ బస్టాప్



బాలకృష్ణ బస్టాప్

నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 34 శాతమేనా?



బుద్ధ రాజేష్

అనకాపల్లి టౌన్: వైఎస్సార్‌సీపీ పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాల ప్రజలకు నామినేటెడ్ పదవుల్లో 50 శాతం అవకాశం కల్పిస్తే, కూటమి ప్రభుత్వం 34 శాతం ఇవ్వడానికి క్యాబినేట్‌లో ఆమోదించడం అన్యాయమని ఉత్తరాంధ్ర చర్చా వేదిక సభ్యుడు బుద్ధ రజేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో అధిక శాతం బీసీ వర్గాల ప్రజలు జీవిస్తున్నారని, వివిధ నామినేటెడ్ పదవుల్లో స్థానికులకు 65 శాతం కల్పించాలని డిమాండ్ చేశారు.

విశాఖ డెయిరీ అవకతవకలపై విచారణకు డిమాండ్

ఏపీ పాల రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ



మాట్లాడుతున్న మర్రాపు సూర్యనారాయణ

అనకాపల్లి టౌన్: విశాఖ డెయిరీలో అవకతవకలపై తక్షణమే విచారణ జరిపి నిందితులను శిక్షించాలని ఏపీ పాల రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ డిమాడ్ చేశారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవన్‌లో ఏపీ పాలరైతు సంఘం, డెయిరీ పరిధి ఆరు జిల్లాల పాల రైతుల సంఘం ప్రతినిధుల సమావేశం శుక్రవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ డెయిరీ యాజమాన్యం పాల రైతులకు 10 శాతం ధర తగ్గించడం, ఆవు పాల సేకరణపై ప్రకటించిన కొత్త విధానం రైతులకు ఎంతమాత్రం ఉపయోగలేదన్నారు. పాల ధర పట్టికలో మార్పు చేసిన విధంగా కనీస వెన్నశాతం 2.8 శాతం నుంచి 3.1 శాతానికి పెంచడం వల్ల ఎక్కువ మంది రైతులు నష్టపోతున్నారన్నారు. కేంద్రాల నుంచి 30 లీటర్ల కంటే తక్కువ పాలు సేకరణ నిలుపుదల చేయడం నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. ప్రస్తుతం పశుపోషణ ఖర్చులు విపరీతంగా పెరిగినా పాల సేకరణ ధర పెంచకపోవడం వంటి నిరంకుశ నిర్ణయాలతో రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. డెయిరీకి వస్తున్న కోట్లాది రూపాయలను దారి మళ్లించి నష్టాలు చూపిస్తున్నారని విమర్శించారు. డెయిరీలో అక్రమాలపై కూటమి ప్రభుత్వం వేసిన హౌస్ కమిటీ విచారణ ముందుకు సాగకపోవడం అన్యాయమన్నారు. పాల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి. రాంబాబు జిల్లా గౌరవాధ్యక్షుడు అప్పారావు, అధ్యక్షుడు భూలోక నాయుడు, విజయనగరం జిల్లా సంఘం కార్యదర్శి గొంపా కృష్ణమూర్తి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన



ఉత్సవ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆలయ అధ్యక్షుడు బిల్లపాటి కృష్ణకుమార్ దంపతులు



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న అనకాపల్లి వర్తక సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సంఘం సభ్యులు

అనకాపల్లి: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రతిష్ట శతజయంతి ముగింపు ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శుక్రవారం ప్రధాన అర్చకులు రేజేటి శ్రీరామచార్యులు, రేజేటి సీతారామాచార్యలు ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి సన్నిధిలో మహామేరువుకు శ్రీచక్రనవార్చన, నిత్య హోమం, నీరాజన మంత్ర పుష్పంతోపాటు ఆలయ అధ్యక్షుడు బిల్లపాటి కృష్ణ కుమార్ క్షీరాభిషేకం చేశారు. వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ(పెద్దబాబు), సంఘం సభ్యులు కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. సాయంత్రం 4 గంటలకు సాముహికంగా మహిళలతో లక్ష కుంకుమార్చనలు, చండీహోమం, ఏకోత్తర సహస్ర కలశ మండపారాధన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిష్ట శతజయంతి ఉత్సవ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు మాట్లాడుతూ శనివారం ఉత్సవం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తమిళనాడు రాష్ట్రం కుర్తాళం శంకరాచార్యులు సిద్దేశ్వర పీఠాధిపతులు సిద్దేశ్వరానంద భారతీ మహాస్వామి, దత్తేశ్వరానంద భారతీ స్వామి విచ్చేయుచున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన, సాయంత్రం 6 గంటలకు ఉత్సవ అనంతరం నగరేశ్వరస్వామి, జనార్దన స్వామి వార్ల వార్షిక తిరుకల్యాణం మహోత్సవం నిర్వహిస్తామన్నారు. శతజయంతి ఉత్సవ కమిటీకో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉపాధ్యక్షుడు వుప్పల రవి రామ్‌జవహర్, సహాయ కార్యదర్శి గ్రంధి వీవీఎస్ మాణిక్యం, ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

బైక్ ర్యాలీ ప్రారంభించిన డీఎస్పీ శ్రావణి



సుంకరమెట్ట జంక్షన్ వద్ద బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రావణి



ద్విచక్ర వాహనంపై హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతున్న వాహనదారులు

అనకాపల్లి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, రోడ్డు ప్రమాదాల నుంచి ప్రాణాలను కాపాడుకోవాలని డీఎస్పీ ఎం.శ్రావణి తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు పురస్కరించుకుని స్థానిక సుంకరమెట్ట జంక్షన్ వద్ద బైక్ ర్యాలీని శుక్రవారం ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించినట్లయితే రోడ్డు ప్రమాదాలను నిర్మూలించవచ్చన్నారు. అంతకుముందు బైక్ ర్యాలీ పట్టణ పురవీధుల్లో సాగింది. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ఎం. వెంకటనారాయణ, పట్టణ సీఐ టి.వి.విజయ కుమార్, బైక్ అసోసియేషన్ సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవం నేడు

విద్యుద్దీపాలంకరణతోపాటు పలు ఏర్పాట్లు



కశింకోటలోని ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ



కనకదుర్గ విద్యుద్దీప కటౌట్

కశింకోట: స్థానిక శివాలయం వద్ద వెలసిన గౌరీపరమేశ్వరుల(గౌరమ్మ) ఉత్సవాన్ని శనివారం పెద్ద ఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా ఫిబ్రవరి రెండో వారంలో ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. కార్తీక మాసంలో గౌరమ్మను నెలకొల్పి నెల రోజులపాటు పూజలు నిర్వహించి ఉత్సవాన్ని వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పెద్ద ఎత్తున జరుపుతారు. గౌరమ్మ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించి శారదానదిలో నిమజ్జనం చేస్తారు. ఇది దాదాపు అర్ధ శతాబ్ద కాలంగా జరుగుతోంది. ఈ ఏడాది ఉత్సవాన్ని భారీగా నిర్వహించి గౌరమ్మను ఊరేగించి ఆదివారం శారదానదిలో నిమజ్జనోత్సవం నిర్వహించడానికి నిర్వాహకులు సన్నాహాలు చేశారు. ఇక్కడ నిర్వహించే ఉత్సవానికి కళ ముందుగానే వచ్చింది. ఈ సందర్భంగా స్థానిక ప్రధాన రహదారిని విద్యుద్దీపాలంకరణతో అలంకరించారు. కనకదుర్గమ్మ, గౌరమ్మ, రాఘవేంద్రస్వామి తదితర విద్యుద్దీప కటౌట్లను, జాతీయ రహదారి కూడలి వద్ద ప్రవేశ ద్వారాన్ని ఏర్పాటు చేశారు. ఇవి ఆహూతులను ఆకట్టుకుంటున్నాయి. ఉత్సవ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. విజయనగరానికి చెందిన బృందంతో బుర్రకథ, సర్కార్ డాన్స్ షో, డాన్స్ మస్తీ, డాన్స్ హంగామా, డాన్స్ బేబీ డాన్స్, కరీంనగర్ వారి నెమలి నృత్యం, పలు నేల వేషాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరవుతారని తెలిపారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చనున్నట్లు చెప్పారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు

గౌరమ్మ ఉత్సవం పురస్కరించుకొని ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. ఉత్సవానికి వచ్చే ద్విచక్ర వాహనాలు, కార్లను నిలపడానికి సరోజిని విల్లా, పెంకుల ఫ్యాక్టరీ, ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

వేడుకగా సారె ఊరేగింపు



కశింకోటలో మహిళల సారె ఊరేగింపు



మహిళల కోలాటాల ప్రదర్శన

కశింకోట: స్థానిక శివాలయం వద్ద వెలసిన గౌరీపరమేశ్వరుల(గౌరమ్మ) సారె ఊరేగింపు శుక్రవారం రాత్రి కనుల పండువగా జరిగింది. స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూలు వద్ద ఆలయంలో గౌరమ్మకు మహిళలు పళ్లాల్లో అరటి గెలలు, వివిధ రకాల పిండి వంటలు, పంచదార చిలుకలు తెచ్చి నివేదించి పూజలు చేశారు. అనంతరం గౌరమ్మ చిత్రపటాన్ని అందంగా అలంకరించిన రథంపై నిలిపారు. అక్కడి నుంచి సారె ఊరేగింపు ప్రారంభమైంది. మహిళలు సారెతో గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా ఊరేగింపు జరిపారు. ఈ మహిళల కోలాటాల ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు వేగి గోపీకృష్ణ, వేగి దొరబాబు, బొడ్డేడ సత్యసాయి బాలాజీ, వేగి వెంకటరావు, కాండ్రేగుల సతీష్, కోయిలాడ నాగు, వేగి రాము, ఆడారి నరసింగరావు, పెంటకోట తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

కీచక ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి

యలమంచిలి రూరల్: బుచ్చెయ్యపేట మండలం వడ్దాదిలో ప్రైవేటు స్కూల్‌లో 9వ తరగతి విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కీచక ఉపాధ్యాయుడ్ని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం యలమంచిలిలో విద్యార్థులు నిరసన తెలియజేశారు. రాష్ట్రంలో, జిల్లాలో రోజురోజుకూ మైనర్లపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ పరిస్థితులను చక్కదిద్దాలని కోరుతూ విద్యార్థులు ప్రధాన రహదారిపై ర్యాలీ, మానవహారం చేపట్టారు. దీనికి నేతృత్వం వహించిన ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎం అభిషేక్, జల్ల శ్రీను మాట్లాడుతూ రాష్ట్రంలో మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగంతో పాటు మైనర్లపై లైంగిక దాడులు, వేధింపులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం చేయడం, నిందితులకు చట్టపరంగా త్వరితగతిన కఠినంగా శిక్షలు పడేలా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మైనర్లు, చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడాలంటే భయం ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం వల్లే ఇలాంటి పరిస్థితులు, వరుస ఘటనలు జరుగుతున్నాయని విమర్శించారు. ఎస్ఎఫ్ఐ నేతలు కృప, రాజేష్, సింహాద్రి పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజ సేవ చేయాలి

నావికాదళం చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ అడ్మిరల్ మురళీమోహనరాజు



మాట్లాడుతున్న నావికాదళం చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ అడ్మిరల్ మురళీమోహనరాజు

అనకాపల్లి: విద్యార్థులు సమాజానికి సేవ చేయాలని నావికా దళం చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ అడ్మిరల్ మురళీమోహన్‌రాజు ఉద్బోధించారు. స్థానిక దాడి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(అటానమస్) కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన వైబ్రేంట్ డైట్ 2825 ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకొని, దాని సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. గౌరవ అతిథి నావికా దళం కెప్టెన్ ధీరజ్ మాట్లాడుతూ విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేయరాదన్నారు. ప్రధానంగా సంప్రదాయాలు పాటిస్తూ స్నేహం, పట్టుదల, నిరంతర కృషి ఉండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు, పాటల ప్రదర్శన ఆహూతులను అలరించింది. నేపథ్య గాయకుడు అదితి భావరాజు, కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ ఆర్. వైకుంఠరావు, విబ్రెంట్ డైట్ కన్వీనర్ కె. సుజాత, వైస్ ప్రిన్సిపాల్ గణేష్‌ప్రసాద్‌రెడ్డి, డీన్ అడ్మిన్ కె.ఎస్. ఈశ్వరరావు, డీన్ అకడమిక్ ఎ. కృష్ణనాగ్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అనకాపల్లి: విద్యుత్ శాఖ డి-1 సెక్షన్ పరిధిలో విద్యుత్ తీగలు మరమ్మతులు నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంట ల వరకూ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్, ఏఈ త్రినాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11 కేవీ టౌన్-2 ఫీడర్ పరిధిలో పూడిమడక రహదారి, శారదా కాలనీ, నెహ్రూ చౌక్, వేల్పుల వీధి బాలికోన్నత పాఠశాల, తహసీల్దార్ కార్యాల యం రహదారి, పాత బర్మా కాలనీ ప్రాంతాల్లో ఈ అసౌకర్యం ఉంటుందని, వినియోగదారు లు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.